ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

సోమవారం 5 మే 2025

పైకి రానంటున్న పాతాళగంగ!





ఎడారిని తలపిస్తున్న గోదావరి నది

- భూపాలపల్లి జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- డేంజర్ జోన్‌లో కాటారం
- రాష్ట్ర సగటుతో పోలిస్తే చాలా తేడా..
- పెరుగుతున్న ఎండల తీవ్రతతో జటిలమవుతున్న సమస్య
- గోదావరి, మానేరు నదుల్లో నీరు ఇంకిపోవడమూ కారణమే
- నీరు లేక వట్టిపోతున్న బోర్లు..

భూపాలపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుండడంతో ఉపరితల జల వనరులన్నీ ఆవిరైపోతున్నాయి. దీంతో భూగర్భ జలాలు కూడా వేగంగా పాతాళానికి చేరుతున్నాయి. ముఖ్యంగా గోదావరి, మానేరు నదుల పరివాహక ప్రాంతాల మధ్య ఉన్న భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలమట్టం ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోతున్నట్లు భూగర్భ జల వనరుల శాఖ గుర్తించింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతూ అత్యంత లోతుల్లోకి పడిపోతున్నాయని అంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ వరకు గోదావరి నది పూర్తిగా ఎండిపోయి ఇసుకమేటలతో ఎడారిని తలపిస్తోంది. అటు మానేరు నది కూడా పూర్తిగా ఎండిపోవడంతో ఈ రెండు నదుల పరివాహక ప్రాంతాల్లో ఉన్న మల్హర్, కాటారం, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. ఇటు జిల్లా కేంద్రమైన భూపాలపల్లితో పాటు మహా ముత్తారం మండలాల్లోనూ భూగర్భ జలాలు భారీగా తగ్గినట్లు తేలింది. ముఖ్యంగా కాటారం మండలంలో భూగర్భ జలాల మట్టం రాష్ట్ర సగటుతో పోలిస్తే దాదాపు 30మీటర్ల అధిక లోతుల్లోకి పడిపోయాయి. రాష్ట్రం లో 9.91 మీటర్ల సగటు లోతు నమోదైతే.. కాటారం మండలంలో మాత్రం 39.26 మీటర్ల లోతుకు భూగర్భ జలాల మట్టం పడిపోయిందని గుర్తించారు. ఇక్కడ ఉపరితల జన వనరులు పెద్దగా లేకపోవడం, అత్యధిక సంఖ్యలో బోర్లపై ఆధారపడి రైతులు సాగు చేస్తున్న కారణంగానే భూగర్భ జలాల తగ్గుదల భారీగా ఉందంటున్నారు. అంతేకాకుండా గతంలో ఇటు మానేరు అటు గోదావరి నదులలో నీరు నిల్వ ఉండడం వల్ల గత మూడేళ్లలో భూగర్భ జలాల తగ్గుదల పెద్దగా కనిపించలేదని చెబుతున్నారు. మేడిగడ్డ దెబ్బ తిన్న తర్వాత ఇటు అన్నారం, అటు మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని వదిలేయడం వల్ల ఈ ఏడాది భూపాలపల్లి జిల్లాలో ముఖ్యంగా కాటారం ప్రాంతంలో భూగర్భ జల మట్టాలు భారీగా తగ్గేందుకు కారణమని అంటున్నారు. గత నెలలో భూగర్భ జల వనరుల శాఖ పిజో మీటర్ల సాయంతో సేకరించిన డాటాను విశ్లేషించినప్పుడు కాటారం మండలం రేగులగూడెంలో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయిలో 39.26మీటర్ల లోతుకు పడిపోయినట్లు గుర్తించారు.

విచ్చలవిడి బోర్ల తవ్వకమూ కారణమే..

భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాలు పడిపోవడానికి వాతావరణ పరిస్థితులకు తోడు రైతులు విచ్చలవిడిగా చేపడుతున్న బోర్ల తవ్వకాలు కూడా కారణమని చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులు తమ పొలాల్లో 200 నుంచి 250 అడుగుల లోతు వరకు బోర్లను డ్రిల్లింగ్ చేయిస్తున్నారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో సాగు చేసే మెట్ట పంటల కోసం సాగునీటికి సమస్యలు ఉత్పనమవుతుండడంతో రైతులు చెరువులు, వాగులు, నదుల పరిసరాల్లో భారీ సంఖ్యలో గొట్టపు బావులను తవ్వి పంటలను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాల్టా చట్టం అమలులో ఉన్న అధికారులు పట్టించుకోకపోవడం కూడా సమస్య తీవ్రత పెరిగేందుకు కారణమవుతోందని అంటున్నా రు. ముఖ్యంగా మలహర్, కాటారం, మహాదేవపూర్ మండలాల్లో రైతాంగం మానేరు, గోదావరి నదుల అంతర్భాగాల్లో ఫిల్టర్ బోర్లు పెద్ద సంఖ్యలో వేసి తమ పంటలను రక్షించుకునే ప్రయత్నం చేశారు. గోదావరిలో ప్రవాహం ఆగిపోవడం వంటి కారణాలతో ప్రస్తుతం ఆ బోర్లన్నీ కూడా పట్టిపోయాయి. దీంతో చాలామంది రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు అధిక లోతుల్లోకి తవ్వకాలు జరిపి భూగర్భ జలాలను పంటలకు వినియోగించారని చెబుతున్నారు.



కాటారంలో నీరు రాక వట్టిపోయిన బోర్లు

పాతాళంలో భూగర్భ జలాలు..

భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతున్న నేపథ్యంలో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జల వనరుల శాఖ గణంకాల ప్రకారం భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో గత ఏడాది నవంబర్లో సేకరించిన సమాచారం ప్రకారం భూగర్భ జల మట్టం 15.57 మీటర్ల లోతులో ఉండగా, మార్చి నెలలో సేకరించిన గణాంకాల ప్రకారం 39.26 మీటర్ల లోతుకు పడిపోయాయి. భూపాలపల్లి మండలంలో గత ఏడాది 10.23 మీటర్ల లోతులో ఉండగా ప్రస్తుతం 18.12 మీటర్లకు పడిపోయాయి. అలాగే చిట్యాల మండలంలో గత ఏడాది 7.19 మీటర్ల లోతులో ఉండగా ప్రస్తుతం 12.26మీటర్ల లోతుకు పడిపోయాయి. మహాముత్తారం మండలంలో గత ఏడాది 20.07మీటర్ల లోతులో ఉండగా ప్రస్తుతం 27 మీటర్ల లోతుకు తగ్గాయి. మలహర్ మండలంలో గత ఏడాది మే నెలలో సేకరించిన సమాచారం ప్రకారం 16.96మీటర్ల లోతులో ఉండగా తాజా గణాంకాలు ఇంకా సేకరించాల్సి ఉంది.

వనదేవతలకు జోరుగా మొక్కులు

మేడారంలో భక్తుల సందడి



మేడారం గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

తాడ్వాయి, మే 4(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారం.. కోరిన వరమిచ్చే వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల గద్దెల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఈ క్రమంలో తల్లుల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. కోరికలు తీరాలని దేవతలను వేడుకున్నారు. సుమారు 10వేల మంది భక్తులకు పైగా అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

తాగు నీటి తంటాలు

సమస్యలు తీరాలని దేవతలను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు దేవస్థానంలో కొత్త సమస్య ఎదురు అవుతుందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గద్దెల ప్రాంగణంలో కనీసం తాగునీటి సౌకర్యం లేకపోండంతో దేవాదాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు లేకుండా సిబ్బందితో దేవస్థానం నిర్వహణ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. విరాళాల కౌంటర్ వద్ద కనీసం సిబ్బంది కూడా లేకపోవడంపై అధికారులను తప్పుపడుతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వైభవంగా దత్తాత్రేయస్వామి

వార్షికోత్సవ వేడుకలు

- పూజల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి



హోమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, మే 4(ఆంధ్రజ్యోతి): కాటారం మండలం లోని ధన్వాడలో శ్రీదత్తాత్రేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు కృష్ణమోహన్‌శర్మ, నగేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శివ, లింగన్న, శ్రీకాంత్‌శర్మ, శ్రీనివాస్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుచే వేదపండితులు గణపతి, రుద్ర, దత్తహోమాలు, లఘు న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం, కలశ పూజ, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించు కుని మొక్కుకు న్నారు. కార్య క్రమాల్లో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రె స్ అధ్యక్షులు రాజబాపు, తిరుపతియాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ సమ్మయ్య, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాలలో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిట్యాల, మే 4(ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రం లో పార్టీ మండల అధ్యక్షు డు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, మంత్రులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విమర్శలు చేయడమే కాకుండా రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. గాంధీ, అంబేద్కర్ ఆశయాలను సిద్దాంతాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలంటే.. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కక్షపూరితంగా కేసులు పెట్టడం తగదని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని అందరిచే ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు జిల్లాల సంవిధాన్ పరిశీలకుడు పున్న కైలాస్‌నేత, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, నాయకులు మధువంశీకృష్ణ, రాయకొంరు, దొడ్డి కిష్టయ్య, మాజీ జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, బుర్ర లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్

- 12 మంది గైర్హాజరు
- 15 నిమిషాలు ఆలస్యంతో వెనక్కి వెళ్లిన విద్యార్థిని

భూపాలపల్లిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాలలో 240 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 105 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. మొత్తంగా 345 మంది విద్యార్థులకు గాను 12 మంది గైర్హాజరయ్యారు. అయితే ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులు అరగంట ముందుగానే వచ్చారు. చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన కొమ్ము వైష్ణవి 15 నిమిషాలు ఆలస్యంగా(1:45గంటలకు) రావడంతో ఆమెను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదు. అలాగే కాటారానికి చెందిన మరో విద్యార్థిని లక్ష్మీ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోనికి వెళ్లి హాల్ టికెట్ ఇద్దరివి ఒకే నెంబర్ వచ్చిందని ఏడ్చింది. వెంటనే అక్కడి చీఫ్ సూపరింటెండెంట్ వచ్చి ఆమె హాల్ టికెట్‌ను మరలా కొత్త ప్రింట్ తెప్పించారు. ఈ క్రమంలో ఆమె హాల్‌టికెట్ నెంబర్ చివరిగా 091 ఉండగా దానిని 001గా భావించడంతో ఒకే నెంబర్ అనుకుని ఆందోళన పడింది. కానీ దానిని ఆ సమస్యను సిబ్బంది క్లియర్ చేయడంతో లోపలికి వెళ్లి పరీక్ష రాసింది. ఇదిలా ఉంటే. పరీక్షా కేంద్రం లోనికి కనీసం పెన్నులు సైతం వెంట తీసుకువెళ్లనీయలేదు. ప్రతీ విద్యార్థిని తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా బ్యాన్‌చేశారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే చేశారు. ఇటు పోలీసులు, అటు పర్యవేక్షణ అధికారుల సమక్షంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



హాల్‌టికెట్ నెంబర్ ఒకేలా వచ్చిందని ఏడుస్తున్న విద్యార్థిని



భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఏళ్లుగా తిష్ఠ వేసిందెవరు..!



భూపాలపల్లి సింగరేణి జీఎం కార్యాలయం

- సింగరేణిలో పాతుకుపోయిన అధికారులపై సంస్థ నజర్
- ఐదు, పదేళ్లుగా పని చేస్తున్న వారి వివరాల సేకరణ
- భూపాలపల్లి ఏరియాలో 611 మంది వివిధ విభాగాల ఉద్యోగులు
- జాబితాను సిద్ధం చేసిన యాజమాన్యం

కృష్ణకాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్న అధికారులపై సంస్థ దృష్టి పెట్టింది. పరపతిని ఉపయోగించుకొని ఐదు నుంచి పదేళ్ల పాటు ఒకే చోట పని చేస్తున్న వారు ఎంత మంది ఉన్నారు.. ఎన్నేళ్లుగా వారు పని చేస్తున్నారనే విషయాలను ఆరా తీస్తున్నారు. ఆ వివరాలను పంపాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో భూపాలపల్లి యాజమాన్యం ఆ దిశగా పని చేస్తున్న అధికారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు వారి జాబితా చేరితే త్వరలోనే వారి బదిలీలు అనివార్యమనే చర్చ సాగుతోంది.

ఏరియాలో 611 మంది ఉద్యోగులు..

భూపాలపల్లి సింగరేణి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓసీలు ఉన్నాయి. వీటిల్లో పర్చేస్, ఈఅండ్‌ఎం, సివిల్, ఐఈడీ, ఈడీపీ, క్వాలిటీ, ల్యాబ్, సెక్యూరిటీ ఎస్‌అండ్‌పీసీ, ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ విభాగం, మెడికల్ విభాగం, సర్వే డిపార్టుమెంట్, ఎస్టేట్, ఫైనాన్స్ పర్సనల్, యుటీసీ, సెఫ్టీ, మైన్స్‌రెస్క్యూ ఏరియా స్టోర్, వర్క్‌షాప్ ఆటోస్టోర్, ఏజెంట్ ఆఫీసులన్నిట్లో కలిపి మొత్తంగా 611 మంది ఉద్యోగులు ఏరియాలో పని చేస్తున్నారు. వీరిలో కాల పరిమితి ముగిసిన వారు చాలా మందే ఉన్నట్లు తెలుస్తోంది. వారివారికి ఉన్నతాధికారులతో ఉన్న పలుకుబడిని ఉపయోగించి భూపాలపల్లి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

కదలనివారు వంద పైచిలుకే...

భూపాలపల్లి సింగరేణి ఏరియాలో ఏళ్లుగా తిష్ఠ వేసిన వారు సుమారు వంద పైచిలుకే ఉంటారని తెలిసింది. వారందరిని వివరాలను సేకరించిన సింగరేణి యాజమాన్యం సంస్థ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సమాచారం. ప్రధానంగా భూపాలపల్లి ఏరియాలో పదేళ్ల పైబడిన జాబితాలో 30 మంది ఉండగా ఐదేళ్ల పైబడి పని చేస్తున్న వారి జాబితాలో 80 మంది వరకు ఉంటారని సమాచారం. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంతో ఈసారైనా తిష్ఠ వేసిన అధికారులకు స్థాన చలనం తప్పక జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. వీరిలో ఇప్పటి నుంచి కొంత మంది అధికారులు తమ స్థానాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలుఆరంభించినట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

అవినీతికి ఆస్కారం.?

సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి ఒకే చోట అధికారులు పని చేస్తుండడంతో అవినీతి, అక్రమాలకు ఆస్కారం కలుగుతున్నట్లుగా సంస్థ ఉన్నతాధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా సంస్థలో నెలకొన్న సమస్యలను గట్టెక్కించాలంటే పాతుకపోయి ఉన్న వారిని కదిలించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో క్వార్టర్ల కేటాయింపులతో పాటు అండర్‌గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్‌కు మార్పు చేసే క్రమంలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినవస్తున్నాయి. కొత్తగా చేరిన కార్మికులను అండర్‌గ్రౌండ్‌లో విధులు కేటాయింపు చేసి.. సీనియర్ వారికి సర్ఫేస్ సౌకర్యాల్ని కల్పించాల్సి ఉంటుంది. కానీ, కొత్తగా చేరిన వారితో పాటు పైరవీలు చేసిన కొంత మందిని నిబంధనలకు విరుద్ధంగా విధుల కేటాయింపులు జరుపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కార్మికులకు ఎదురయ్యే ఏ సమస్య అయినా పరిష్కారం కావాలంటే సంబంధిత అధికారుల చేయి తడపాల్సిందేననే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సంస్థ, సీఎండీ తీసుకున్న నిర్ణయంతో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడోచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎలుకల మందు తాగిన వ్యక్తి మృతి

మరిపెడ(మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాలివారిగూడెంకు చెందిన ఎడేల్లి భిక్షం ఆదివారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరిపెడ పీఎస్ అంజమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్యంతో బాధపడుతున్న భిక్షం గత నెల 30వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఎలుకల మందు తాగాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న మహేందర్‌రెడ్డి, స్థానికులు

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మరిపెడ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాకుల వేంకటేశ్వరుడి దర్శనం చేసుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఎస్ఆర్ వెంచర్ వద్ద ఓ పక్షి డ్రైవర్ క్యాబిన్‌లోకి రాగా, డ్రైవర్ ఆందోళనకు గురి కావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. తొర్రూరు మండలం వెలికట్టెకు చెందిన తండ్రి,కొడుకు రూప్లా, యాకూబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను బీఆర్ఎస్ నాయకులు కుడితి మహేందర్‌రెడ్డి 108కు సమాచారం అందించి జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో సహకారం అందించిన ఆయనకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అస్సాం రైఫిల్స్ అధికారులను కలిసిన యశ్వంత్


యశ్వంత్‌ను అభినందిస్తున్న కల్నల్ సందీప్ శర్మ

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ శనివారం 16 బెటాలియన్ అస్సాం రైఫిల్స్ సీనియర్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. తన పర్వతారోహణ మిషన్ హర్ శిఖర్ పార్ తిరంగా ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎత్తైన శిఖరాలపై భారత జెండా ఎగరవేయడానికి యశ్వంత్ చేస్తున్న ప్రత్యేక ప్రయాణానికి లెఫ్టినెంట్ కల్నల్ సిద్ధార్థ్, సందీప్ శర్మ అభినందనలు, మద్దతును తెలిపారు. తన ప్రయాణంలో ఇద్దరు అధికారుల స్వాగతం, ఆశీర్వాదాలకు యశ్వంత్ కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ నిజమైన హీరోల నుంచి గుర్తింపు తన సంకల్పాన్ని బలోపేతం చేస్తాయని యశ్వంత్ పేర్కొన్నాడు.

చిన్న కాళేశ్వరం పనులను పరిశీలించిన నిట్ ప్రొఫెసర్


ఎస్‌పీటీ నిర్వహిస్తున్న ప్రొఫెసర్ రమణమూర్తి, అధికారులు

కాటారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న పలు పనులను వరంగల్ నిట్(జాతీయ సాంకేతిక కళాశాల) జియో టెక్నికల్ ప్రొఫెసర్ రమణమూర్తి ఆదివారం పరిశీలించారు. చెరువుల కట్టల విస్తరణ పనులు, మత్తడి నిర్మాణాలు నాణ్యతతో పటిష్టంగా చేయడానికి ఇరిగేషన్ అధికారులు చేపడుతున్న చర్యల్లో భాగంగా నిట్ ప్రొఫెసర్ ఆదివారంపేట, గూడూరు చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమణమూర్తి ఇరిగేషన్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి మట్టి పరీక్షలు ఎస్‌పీటీ(స్టాండర్డ్ పెనిట్రేషన్ టెస్ట్) నిర్వహింపజేశారు. ఆదివారంపేట చెరువు మత్తడి నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ చేశారు. గూడూరు చెరువు కట్ట విస్తరణ కోసం సీవోటీ(కట్ ఆఫ్ ట్రెంచ్) పనులకు మట్టి నమూనా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇరిగేషన్ ఈఈ యాదగిరి, ఇరిగేషన్, క్యూసీ ఏఈఈలు వెంకన్న, శిరీష, మెగా డీజీఎం వైవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లయినా ఊసే లేదాయె..

- ఐటీడీఏ పాలక మండలి సమావేశాలపై నిర్లక్ష్యం
- 2019లో నిర్వహణ.. ఇప్పటి వరకు దిక్కేలేదు..
- తిష్టవేసిన సమస్యలు.. సకాలంలో అమలుకాని పథకాలు


మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం

ఏటూరునాగారం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపించింది. ఐటీడీఏల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయి. గిరిజనుల అభివృద్ధికి దశ, దిశను నిర్దేశించే పాలక మండలి సమావేశాలపై అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తద్వారా ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఐటీడీఏ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులకు ఐటీడీఏ ద్వారా ఏఏ పథకాలు అమలవుతున్నయో కూడా తెలియని అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఐటీడీఏ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎమ్మెల్సీలు, ఇతరత్రా ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రతీ మూడు నెలలకొకసారి ఐటీడీఏలో పాలక మండలి సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా గడిచిన ఐదేళ్లుగా వాటి ఊసేలేకుండా పోయింది.

ఐదేళ్లు గడిచే.. ఇంకెన్నాళ్లు వేచిచూడాలో...

ప్రతి మూడు నెలలకొకసారి జరగాల్సిన సమావేశాలు ఐదేళ్లు దాటినా వాటి గురించి పాలకులకు పట్టింపులేకుండా పోయింది. ఎప్పుడో 2019 సంవత్సరంలో పాలక మండలి సమావేశాలు జరగగా ఇప్పటి వరకు దిక్కే లేకుండా పోయింది. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 ఏజెన్సీ మండలాలు, 177 ఏజెన్సీ గ్రామాలున్నాయి. ఆయా మండలాలు, గ్రామాల్లోని గిరిజనుల పాలనంతా ఐటీడీఏదే. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరంతా ఐటీడీఏదే బాధ్యత. 2019 డిసెంబరు 20న నిర్వహించిన 60వ పాలక మండలి సమావేశాలే చివరివి. అప్పటి కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన 60 పాలక మండలి సమావేశాలను చేపట్టారు. ఈ సమావేశాలకు అప్పటి గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సమీక్షించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఆ సమావేశంలోనే ఐటీడీఏ పాలక మండలి సమావేశాలను ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కానీ, అప్పటి మంత్రి ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు.

పథకాల అమలుపై తీవ్ర ప్రభావం

ఐటీడీఏలో పాలక మండలి సమావేశాలు ఏళ్లు గడుస్తున్నా చేపట్టకపోవడంతో పథకాలఅమలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాలు గిరిజనుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలు సకాలంలో అమలుకు నోచుకోక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కొరవడడంతో ఐటీడీఏ అధికారుల పెత్తనమే అంతటా నడుస్తోంది. ఎకనామిక్ సపోర్ట్ స్కీం, గిరివికాసం, స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధి పథకాలు సక్రమంగా అమలు కావడంలేదు. వ్యవసాయం, ఉద్యానవన శాఖ, పట్టుపరిశ్రమ, ఇరిగేషన్ వంటి శాఖలు ఐటీడీఏలో పూర్తిగా కనుమరుగయ్యాయి. ఐటీడీఏలో వ్యవసాయానికి సాయం కరువైంది. కనీసం రైతులకు సలహాలు, సూచనలిచ్చే పరిస్థితిలేదు. వ్యవసాయానికి సబ్సిడీపై విత్తనాలు, యంత్ర పరికరాలు లేకుండా పోయాయి. రైతులకు మేలు చేసే సీఎం గిరి వికాసం వంటి పథకాలు బడ్జెట్ లేక నీరుగారి పోతున్నాయి. గిరిజన నిరుద్యోగులకు వృత్తి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. గిరిజన గ్రామాల్లో వైద్యం దిగజారింది. అప్పుడప్పుడు బాబ్‌మేళాలను తూతూమంత్రంగా చేపడుతూ మమ అనిపిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య కరువైంది. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంపై మాత్రమే అధికారుల హడావిడి కనిపిస్తోంది. ఐటీడీఏలో అనేక సమస్యలు వేధిస్తున్నా కేవలం ఇంజనీరింగ్ పనులపై మాత్రమే శ్రద్ధ చూపడం పలు విమర్శలకు తావిస్తోంది. పాత భవనాలకు మెరుగులు దిద్దడం, ప్రహరీ నిర్మాణాలు, తదితర వాటిపై పెట్టిన దృష్టి మిగతా విషయాలపై సారించకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు.

ఐటీడీఏపై దృష్టి సారించని ప్రభుత్వాలు

ఐటీడీఏలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్న విమర్శలు గిరిజనుల వైపు నుంచి వినిపిస్తున్నాయి. అరకొర బడ్జెట్‌తో ఐటీడీఏల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిధుల లేమితోపాటు ఉద్యోగుల సర్దుబాటు ఐటీడీఏను సమస్యల సుడిగుండాల్లోకి నెట్టుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐటీడీఏల నిర్వహణ సక్రమంగా జరగలేదని పలు గిరిజన సంఘాల నుంచి విమర్శలు ఎదుర్కొంది. ఆ ప్రభుత్వం పోయి కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కూడా ఐటీడీఏకు భరోసా లేకుండా పోయిందని పలు గిరిజన సంఘాలు బాహాటంగానే విమర్శిస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై గిరిజనులు ఆశలు పెట్టుకున్నారు. పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క త్వరలోనే పాలక మండలి సమావేశాల నిర్వహణ చేపడుతామని చెబుతున్నా కార్యాచరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే ఐటీడీఏలో పాలక మండలి సమావేశాలను నిర్వహించి ఐటీడీఏ బలోపేతానికి కృషి చేయాలని గిరిజనులు కోరుకుంటున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంలో భాగంగా మండలాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ సునీల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 5న మండలంలోని పెద్దముప్పారం, ఆగపేట, 6న కాల్వపల్లి, దాట్ల, 7న వేములపల్లి, రామవరం 8న రేపోణి, గున్నేపల్లి, 9న కుమ్మరికుంట్ల బొడ్లాడ, 10న దంతాలపల్లి మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సులో భూభారతి చట్టం సందర్భంగా రైతుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. రైతులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు తమ తమ సమస్యలపై అధికారులతో చర్చించుకోవాలన్నారు.

ధాన్యం బస్తాలు మాయం


చిన్నగూడూరు కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నగూడూరు(మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ రైతు ధాన్యం బస్తాలు మాయమైన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉగ్గంపల్లి శివారు దూమ్యాతండాకు చెందిన రైతు బానోతు వీరన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొనుగోలు కేంద్రంలో వీరన్న ధాన్యాన్ని హమాలీలు కాంటా వేసి 116 బస్తాలు లెక్క చెప్పారు. వారికి 116 బస్తాలకు బస్తాకు రూ.25 చొప్పున రూ.2,900 చెల్లించాడు. కాగా, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు 95 బస్తాలకు ట్రక్ సీట్ రాసి 21 బస్తాల ధాన్యాన్ని మాయం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని బాధిత రైతు వీరన్న డిమాండ్ చేశారు.

బస్టాండ్ నిర్మాణానికి రూ.4.80 కోట్ల నిధులు

- ఆరు నెలల్లో అధునాతన బస్టాండ్ నిర్మాణం
- జిల్లా ప్రజల ఏళ్లనాటి కల సాకారం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


జిల్లా కేంద్రంలో బస్టాండ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

ములుగు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్ల నిధులతో నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించబోతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి నూతన బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రి సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు గట్టమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో హైటెక్ తరహాలో నూతన బస్టాండ్‌ను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ప్రారంభించ బోతున్నామని తెలిపారు. దీంతో మలుగు జిల్లా ప్రజల దశాబ్దాల నాటి కల సాకారం కాబోతుందన్నారు. రాష్ట్రంలోని గ్రామ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల అభిప్రాయం మేరకే రాష్ట్రంలో అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. ములుగు జిల్లా బస్టాండ్ బాగోలేదని మంత్రి సీతక్క తమ దృష్టికి తీసుకొచ్చారని, దీంతో వెంటనే బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు.

మంగపేట మండలంలో రూ.50 లక్షలతో చేపట్టిన బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో ఏటూరునాగారంలో రూ.7కోట్లతో చేపట్టనున్న బస్సు డిపోకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. జిల్లా కేంద్రంలో రూ.45 లక్షలతో ఎకరం స్థలంలో మరో బస్టాండ్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా సంఘాల చేత 600 బస్సులను కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామన్నారు. నూతన బస్టాండ్ కోసం చేపట్టిన ప్రగతిని ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీతక్క తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడారు. ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బస్టాండ్ నిర్మాణ పనులకు నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప విషయమన్నారు. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు రానున్న రోజుల్లో విస్తృత సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శ్రీ మహర్షి భగీరథుడు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సాల్మన్‌రాజ్, డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దముప్పారానికి ప్రభుత్వ విప్ రాక

దంతాలపల్లి (మహబూబాబాద్ జిల్లా), మే 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దముప్పారానికి సోమవారం ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ రానున్నారు. ఈ సందర్భంగా మండల నాయకుడు పొన్నోటి బాలాజీ మాట్లాడుతూ మండలంలోని కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


సర్వయ్య (ఫైల్)

గూడూరు, మే4 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూ బాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... అప్పరాజుపల్లి గ్రామానికి చెందిన మండల సర్వయ్య (55) భార్య అన్నపూర్ణతో కలిసి ఈనెల 3న ఉపాధిహామీ పనికి వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వచ్చిన తర్వాత ఆయన అస్వస్థతకు గురవడంతో భార్య నిమ్మరసం తాగించింది. రాత్రి సమయంలో భోజనం చేసే ముందు కడుపునొప్పి వస్తుందని భార్యతో చెప్పి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం ఉదయం సర్వయ్య నిద్ర లేవకపోవడంతో బోరున విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మృతి చెందినట్లు తెలిపారు. అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి కుమారుడు నరేష్, కుమార్తె కల్యాణి ఉన్నారు.

నాటి రైళ్లేవి..?!

- 'కరోనా'తో కనుమరుగు
- సంక్షోభం అనంతరం ప్రారంభం కాని రైళ్లు
- ప్రారంభమైనా హాల్టింగ్ లేదు..
- 'ఎక్స్‌ప్రెస్'లుగా మారిన ప్యాసింజర్‌లు
- ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి వర్గాలు
- జిల్లాలో ఐదు మండలాల్లో ఏడు రైల్వేస్టేషన్లు


కేసముద్రంలో నిలిచిన రైలు

కేసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల క్రితం వచ్చిన కరోనా సంక్షోభం ముగిసి అన్ని రంగాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే తరహాలో ప్రజా రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్న రైల్వే శాఖలో ప్యాసింజర్ రైళ్ల మాత్రం పునరుద్ధరణ చేయకపోవడంతో కనుమరుగయ్యాయి. గతంలో ఉన్న ప్యాసింజర్, ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లను 'ఎక్స్‌ప్రెస్'లుగా పేర్లు మార్చారు. కరోనా వ్యాప్తి కంటే ముందు నడిపిన రైళ్లన్నీ తిరిగి ప్రారంభించడంలో రైల్వేశాఖ తాత్సారం చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వేల మంది పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు నిత్యం ప్రయాణించే ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరించకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 45 కిలోమీటర్ల రైల్వే లైను

దేశంలో అతిపొడవైన న్యూఢిల్లీ-చెన్నై(గ్రాండ్ ట్రంక్ రూట్) మార్గంలో ఉన్న మహబూబాబాద్ జిల్లాలో ఇంటికన్నె నుంచి డోర్నకల్ జంక్షన్ వరకు 45.42 కిలోమీటర్ల రైల్వే లైను ఉంది. ఇందులో కేసముద్రం, మహబూబాబాద్, కురవి, గార్ల, డోర్నకల్ మండలాలకు చెందిన ఇంటికన్నె, కేసముద్రం, తాళ్ల పూసపల్లి, మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ జంక్షన్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇంటికన్నె, తాళ్లపూసపల్లి, గార్ల రైల్వేస్టేషన్లకు లూప్‌లైన్లు లేకుండా కేవలం మేయిన్ లైన్‌పై నే ఏర్పాటు చేయబడ్డాయి. బొగ్గు గనులప్రాంతమైన భద్రాచలం రోడ్, మణుగూరుకు వెళ్లేందుకు డోర్నకల్‌ను జంక్షన్‌గా ఏర్పాటుచేశారు. జిల్లా మీదుగాప్రతీ రోజు 45 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సగటున 80 గూడ్స్ రైళ్లు కరోనా సంక్షోభం కంటే ముందు వెళ్లేవి. ప్రధాన రవాణా మార్గం అయిన రైళ్లను అధికంగా ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ రైల్వేస్టేషన్ల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణీకులు వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు.

హాల్టింగ్ ఎత్తివేసిన ఎక్స్‌ప్రెస్‌లు ఇవే..

కరోనా సంక్షోభం అనంతరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొన్ని పునరుద్ధరించినప్పటికీ గతంలో ఉన్న రైల్వేస్టేషన్లలో హాల్టింగ్‌ను కొనసాగించడంలేదు. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో గతంలో విశాఖపట్నం-కాచిగూడ మధ్య నడిచే 'లింక్' ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-మణుగూరు మధ్య 'మణుగూరు' ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-బీదర్ మధ్య 'మచిలీపట్నం' ఎక్స్‌ప్రెస్, మణుగూరు-కొల్హాపూర్ మధ్య 'కొల్హాపూర్' ఎక్స్‌ప్రెస్‌లు, బెలగావి-మణుగూరు మధ్య నడిచే 'బెలగావి' ఎక్స్‌ప్రెస్ ఉండేవి. ఈ ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేసముద్రంలో హాల్టింగ్ కల్పించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ప్యాసింజర్ రైళ్లు లేక ఇబ్బందులు

జిల్లాలోని ఏడు రైల్వేస్టేషన్లలో కరోనా సంక్షోభం అనంతరం కొన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాజీపేట-భద్రాచలం మధ్య నడిచే 'మణుగూరు' ప్యాసింజర్, నాగ్‌పూర్-విజయవాడ మధ్య నడిచే 'నాగ్‌పూర్' ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరణ చేయలేదు. ఇక కాకతీయ, సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ల స్థానంలో ఆ పేర్లను తొలగించి ఆయా ప్రాంతాలను సూచిస్తూ ఎక్స్‌ప్రెస్‌గా పేర్లను మార్చి అవే రైళ్లను నడుపుతున్నారు. ఈ ప్యాసింజర్ రైళ్లలో నిత్యం జిల్లాలోని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తదితర పట్టణాలకు అప్‌అండ్‌డౌన్ చేస్తూ జీవనోపాధి కోసం పనుల కోసం వెళ్లే దినసరి కూలీలు, కూరగాయలు, సరుకులు కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయించే చిరు వ్యాపారులు ప్రయాణిస్తుంటారు.

ఒకవైపే హాల్టింగ్‌తో గందరగోళం

సికింద్రాబాద్-తిరుపతి మధ్యన నడిచే 'పద్మావతి' ఎక్స్‌ప్రెస్‌కు డౌన్ వైపు కేసముద్రంలో హాల్టింగ్ ఇచ్చినప్పటికీ అప్ వైపు ఇవ్వలేదు. కాకినాడ-సాయినగర్, మచిలీపట్నం-సాయినగర్ 'షిరిడీ' ఎక్స్‌ప్రెస్ కేసముద్రంలో డౌన్ హాల్టింగ్ ఇచ్చినప్పటికీ అప్‌సైడు హాల్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయా రైళ్లకు డౌన్ వైపు వెళ్లిన ప్రయాణీకులు తిరిగి కేసముద్రానికి రావడానికి ఇతర రైళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒకే రైలుకు ఒకవైపు హాల్టింగ్ మరోవైపు హాల్టింగ్ ఇవ్వకపోవడంపై ప్రయాణీకుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంగా లింగంపల్లి-తాంబరం మధ్య నడిచే 'చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌'కు డోర్నకల్‌లో డౌన్ వైపు హాల్టింగ్ ఇచ్చి అప్ వైపు హాల్టింగ్ లేదు. ఇక పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు రెండువైపులా డోర్నకల్ జంక్షన్‌లో హాల్టింగ్ లేదు. కేసముద్రంలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్ కోసం ఎప్పటి నుంచో వినతులు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వేశాఖ కరోనా సంక్షోభానికి కంటే ముందు ఉన్న ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథాతథంగా రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఇస్తూ పునరుద్ధరించాలని, ప్రయాణీకుల డిమాండ్ ఉన్న చోట ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో ఉన్న రైళ్లను పునరుద్ధరించాలి
కె.కృష్ణదాసన్, కేసముద్రం స్టేషన్



కరోనా సంక్షోభం కంటే ముందున్న ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను కేసముద్రంలో హాల్టింగ్ పునరుద్ధరించాలి. ఆయా రైళ్ల హాల్టింగ్ లేక సికింద్రాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే శాఖ స్పందించి గతంలో ఉన్న రైళ్లకు కేసముద్రంలో హాల్టింగ్ కల్పించాలి.

నదీ స్నానం.. పుణ్యఫలం

15వ తేదీ నుంచి సరస్వతీ పుష్కరాలు

మహదేవపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సమస్త ప్రాణకోటి మనుగడకు ఆధారం జలం. జలం పుట్టిన తరువాతే జీవకోటి ఉద్భవించింది. జలధారల వెంటే నాగరికత విస్తరించింది. అలాంటి జలానికి దేవత రూపాలనిచ్చి తల్లిగా ఆరాధించడం హిందూ సంప్రదాయం. అలాగే నదులు, సముద్రాలు, కోనేరులు, మాఘ, మంగళ స్నానాలు.. ఇలా హిందూ సంప్రదాయం.. నీటితోనే ముడిపడి ఉంది. అలాగే తీర్థ యాత్రలు అని పుణ్యక్షేత్రాల దర్శనం కూడా అంతే. కర్మలు, పిండప్రదానాలు, తర్పణాలు కూడా జలంతో ముడిపడినవే. నదీ తీరంలో పితృకర్మలాచరించడం మోక్షదాయకమని పెద్దలు చెప్తారు. పితరులను ఉద్ధరించడానికి భాగీరథుడు గంగానదిని భూమికి తీసుకువచ్చాడని పురాణాలు చెప్తున్నాయి. తిలోదకాలు ఇచ్చామంటే స్వస్తి వాచకం చెప్పడమని లోకోక్తి. నదీ స్నానాల్లో పుష్కర స్నానం పుణ్యప్రథమని హిందువల విశ్వాసం. తైత్తరీయ ఉపనిషత్తు బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి జలం, జలం నుంచి భూమి, భూమి నుంచి ఔషధాలు, ఔషధాల నుంచి అన్నం, అన్నం నుంచి జీవులు పుట్టాయని వివరిస్తుంది. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం స్నానం. ప్రాముఖ్యతను గుర్తు చేసేవే పుష్కరాలు. పుష్కరం అంటే పన్నెండు సంవత్సరాలు ఒక సారి వస్తాయి. దేశంలోని 12 ముఖ్యమైన నదులన్నింటికి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కరాల సమయంలో స్నానం దశవిధాల మేలు అని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే సరస్వతీ నదికి ఈ నెల 15నుంచి పుష్కరాలు జరగనుండగా.. మన రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరిగే ఏకైక ప్రాంతం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర తీరం. ఈ సారి పుష్కరాలు లక్షలాది మంది భక్తులు తరలొస్తారన్న అంచనాల మధ్య ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.



దశ విధ స్నానాలు

మాలపకర్షణ స్నానం, సంకల్ప, మృత్తికా, మంత్ర, పితృ సంబంధ, గురు సంబంధ, మూల మంత్ర, అఘర్షణ, పురుష సూక్త, తీర్థ స్నానం ఉన్నాయి. పది రకాల స్నానాల్లో తీర్థ స్నానం ఒకటి. దశ విధ స్నానాల్లో అతి శ్రేష్ఠమైనది కూడా అదే. తీర్థ స్నానాచరణకు విధి విధానం ఉంది. ప్రవాహానికి అభిముఖంగా నడుము లోతు నీటిలో నిలబడి, నది ప్రాముఖ్యతనూ, మహిమను స్మరించి, నదికి ఆది దేవతనూ, అభిమాన దేవత అయిన భగవంతుడిని, నామాన్ని ధ్యానించి మునకలు వేయాలి. నదీ స్నానం కేవలం తన శరీరానికే కాదని అంతరంగా కూడా అని తనలో సూక్ష్మరూపంలో నెలకొన్న దైవానికి రూపంగా కూడా భావించాలి. దశ విధ స్నానాలలో తీర్థస్నానం ఉత్తమమైనదే పుష్కర పుణ్య మసయంలో ఆచరించే పుష్కర స్నానం విశేష ఫలదాయకం అని పెద్దలు చెప్తారు. గౌతమ మమర్షికి గోహత్య పాపం నుంచి వోమచనం అనుగ్రహించిన గోదావరి పుష్కర స్నానం అంతరంగ ప్రక్షాళనకు అద్వితీయమైన సాధనం. అందులో కలిసే ప్రాణహిత, సంగమంలోని అంతర్వాహిని సరస్వతి నదికి అదే వర్తిస్తుంది. సరస్వతి నది స్నానానికి ఒక అనుష్ఠాన ప్రక్రియ నిర్ధేశించి ఉంది. ఒక భావనా పద్ధతి ఉంది. ప్రతీ క్రియకు ప్రతి ప్రక్రియకు ఒక పరామర్థం. ప్రతి పరమార్థానికి ఒక ఫలితం ఉంటాయి. స్థూలంగా కనిపించే ప్రతి దానికి ఒక సూక్ష్మ రూపం ఉంటుంది. సూక్ష్మంలో మోక్షం అని అందుకే అంటారు. సూక్ష్మాతి సూక్ష్మమైన , స్థూలాతి స్థూలమైన విశ్వమూ ఆ పదార్థాల సమ్మేళనంతోనే రూపొందింది అండంలో, పిండంలో, బ్రహ్మాండంలోఅన్నింటిలో అన్నీ ఉన్నాయి. మనిషిలోనూ ఉన్నాయి. ఈ విశాల విశ్వంలోని ప్రకృతి విన్యాసం మనిషిలోనూ ఉంది. అందుకే ప్రపంచంలో ప్రవహించే నదులు కూడా మానవ శరీరంలో ఉన్నాయని తత్వవేత్తలు సెలవిచ్చారు.

పుష్కర స్నానమాచరించి పునీతులు కండి

- కాశీ ఉత్తర పీఠాధికారి సుదర్శనానంద స్వామి ఉద్బోధ
- రుద్రేశ్వరాలయాన్ని సందర్శించిన స్వామిజీ

హనుమకొండ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా అనంతరం ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వస్తున్న పవిత్ర సరస్వతీ నది పుష్కరకాలంలో సమీప నదుల్లో భక్తులు స్నానాలు ఆచరించి పునీతులు కావాలని వారణాసి (కాశీ) ఉత్తర పీఠాధికారి సుదర్శనానంద స్వామిజీ ఉద్బోధించారు. కాళేశ్వరంలోకి ఆలయాన్ని సందర్శించి ఆదివారం నేరుగా ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం చేరుకొని స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఉత్తిష్ట గణపతి దర్శనం చేయించి అనంతరం గర్భాలయంలో కొలువైన కాకతీయుల కాలం నాటి రుద్రేశ్వరుడిని స్వామిజీ సందర్శించి వారణాసిలోని మణికర్ణిక ఘాట్ నుంచి తన వెంట తీసుకొచ్చిన గంగాజలంతో స్వయంగా తానే అభిషేకం నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో భక్తులకు మంగళహారతులు సమర్పించి అనుగ్రహ భాషణం చేశారు. వరంగల్ వాసులకు సమీపంలోని



రుద్రేశ్వరాలయంలో మాట్లాడుతున్న సుదర్శనానందస్వామి

త్రిలింగేశ్వర ఆలయంగా ప్రసిద్ధిగాంచిన కాళేశ్వరంలో పుష్కరస్నానాలు ఆచరించాలని సూచించారు. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో తమ వారణాసి పీఠాధిపతి సురేశ్వరానందస్వామిజీ ఆధ్వర్యంలో భక్తులకు విశేష సేవలందించామని చెప్పారు. అక్కడి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో 60 కోట్ల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారని చెప్పారు. సరస్వతీ పుష్కరాలకు కూడా ఇక్కడి తెలంగాణ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని పుష్కరాలకు చేస్తున్న ఏర్పాట్లు ఎంతో ప్రశంసనీయమైనవని స్వామిజీ పేర్కొన్నారు. పుష్కర సమయంలో రాజకీయాలు, ప్రజల మధ్య విభేదాలు విస్మరించి ప్రతి ఒక్కరూ స్నానమాచరించాలన్నారు. భారతదేశం భిన్నత్వంతో ఏకత్వంగా భాసిల్లుతూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ ఒక మహోన్నత శక్తిగా ఎదిగారని అన్నారు. భగవత్ రామానుజులు, శంకరాచార్యులు, మధ్వాచార్యులు, బసవేశ్వరుల స్ఫూర్తితో హిందూ సమాజం ఆధ్యాత్మికతతో విలసిల్లుతోందన్నారు. ఆలయ ఈవో అనిల్ కుమార్, మణికంఠ శర్మ తదితరులు పాల్గొన్నారు. స్వామిజీ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


ఉన్నది తొమ్మిది రోజులే..

- పిల్లర్లకే పరిమితమైన పనులు
- మంత్రి ఆదేశాలు బేఖాతరు
- పుష్కరాల పనులకు గ్రహణం
- పట్టించుకోని పాలకులు

మహదేవపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాలకు సర్వ సిద్ధమయ్యాయని అనుకుంటే పొరపాటే .. ఏర్పాట్లలో ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే అతిశయోక్తి కాదు.. మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా పనులను పరిశీలించినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది పరిస్థితి. పరమశివుడి సన్నిధిగా పేరొంది.. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాళేశ్వరాలయ అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. అన్ని ఉన్నా అల్లుడి నోట్లశని ఉన్నట్లు నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉంది. పతి పన్నెండు ఏళ్ల కోసారి జరిగే పుష్కరాలు మళ్లీ ఈ సంవత్సరం ఈ నెలలో వస్తున్నందున పనులు జరగకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం పుష్కరాల అభివృద్ధి పనుల కోసం , కాళేశ్వర ఆలయ అభివృద్ధి కోసం రూ.25కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తయినయి.. అయినా ఇంతవరకు పనులు పూర్తి కావడం లేదు. ఇంకా తొమ్మిదిరోజులే ఉన్నా.. అయినా ఇంతవరకు పనులు పూర్తి కాకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



పుష్కరఘాట్ వద్ద పిల్లర్ల వరకే పరిమితమై ఉన్న స్నాన గదులు



పుష్కరఘాట్ వద్ద ఇంకా నిర్మాణంలోనే ఉన్న కేశఖండన గదులు

ఇంకా పూర్తి కాని పనులు ఇవే..

శారదా మండపం పనులు పిల్లర్ల వద్దనే ఉన్నాయి. వీఐపీ ఘాట్ వద్ద మెట్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. బట్టలు మార్చుకునే గది, స్నానపు గదులు, మరుగుదొడ్ల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పుష్కర ఘాట్ వద్ద ఆర్చి తోరణం పూర్తి కాలేదు. మండపం పనులు, సరస్వతి మాత విగ్రహ పనులు 20 శాతం కూడా పూర్తి కాలేదు. పనులకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో రూ. 25 కోట్లు మంజూరైనా ఏం లాభం లేకుండా పోతుంది. పుష్కర ఘాట్ అభివృద్ధి.. వీఐపీ ఘాట్‌కు రోడ్డు, పార్కింగ్, ఆలయంలో కొత్త అభివృద్ధి పనులు, బస్టాండ్ రహ దారి, ఇతరత్రా పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మళ్లీ 25 కోట్లు వృథాగానే పోతాయో మనని పలువురు భక్తులు చర్చించుకుంటున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడి పనులుకు ఇంత జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజ రామయ్యార్ ఇటీవల వరుస మీటింగ్‌లు పెట్టి అభివృద్ధి పనులపై ఆరా తీసినా ఇంతవరకు ఆ పనులకు మోక్షం రావడం లేదు. ఆలయం నుండి గోదావరి దాకా చలువ పందిళ్లు, నీడ ప్రదేశాలు ఏర్పాటు చేస్తేనే భక్తులకు సౌకర్యంగా ఉంటంది. తాగునీటి వసతిని మెరుగు పరచాల్సి ఉంది. గోదావరి ఒడ్డున స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు, శాశ్వత మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా పట్టించుకునే నాథుడు లేదు. కేశఖండన గదుల నిర్మాణం పిల్లర్ల వరకే పరిమితమై ఉంది. అసలు పుష్కరాల వరకు పూర్తయ్యేనా అనే సందేహం నెలకొంది. మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ వరుస సమావేశాలు ఏర్పాటు చేసి ఏం లాభం ఇంతవరకు ఏ పని పూర్తి కాలేదని పలువురు విమర్శిస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.25 కోట్లు

తొమ్మిది సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ఆలయాభివృద్ధి కోసం రూ. 25 కోట్లు మంజూరు చేశారు. అప్పటి పనులు ఇప్పటివరకు పూర్తి కాకపోగా కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. గతంలోనే నిధులు మంజూరైనా ఆ డబ్బులు లెక్కా పత్రం లేకుండా పనులు పూర్తి కాలేదు.. వంద రూముల వసతి గృహాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.. అన్నసత్రం మధ్యలోనే ఆగిపోయాయి. సగం కట్టిన బిల్డింగ్‌లు అలాగే వదిలేయడంతో చెట్లు పెరిగిపోయాయి.

వేసవిలో వివాహాది శుభ కార్యాలున్నా..

ఏటా వేసవి మూడు నెలలు వివాహ శుభ కార్యాలయాల సమయాల్లో కాస్త ఎక్కువగానే బంగారం కొనుగోళ్లు జరిగేవి. ఈ యేడు పెరిగిన ధరతో కొనుగోళ్లు పూర్తిగా పడిపోయాయి. పెళ్లిళ్ల సీజన్ అయినప్పటికీ వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో జ్యూవెల్లరీ షాపులు గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. ఆడవారికి ఎంతో ఇష్టమైన బంగారు ఆభరణాలు ధరించాలంటే సంపన్నులై ఉండాలి. లేదంటే ఉన్న స్థిరాస్తులను అమ్మి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పక తప్పదు. ఆడ పిల్లల వివాహాలకు భారీ మొత్తంలో బంగారం కొనుగోలు చేసే వారు సైతం ప్రస్తుతం సంప్రదాయ మెట్టెలు, పుస్తెల తాడుతోనే సరి పెట్టుకుంటున్నారు. అప్పటికే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ధర ఆర్థిక భారంగా మారింది.

లగ్గమే 'బంగారమాయెనా'..!?

- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కలగానే బంగారం
- పెళ్లిళ్ల సీజన్ అయినా కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న జ్యువెల్లర్స్
- రూ.లక్షకు చేరువైన తులం పసిడి ధర
- వన్ గ్రామ్‌గోల్డ్ ఆభరణాలే దిక్కంటున్న మహిళలు

మహబూబాబాద్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల్లా పసిడి ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకూ బంగారం ధరలు పెరిగిపోయి తులం బంగారం (24 క్యారెట్లు) ధర లక్షకు చేరువైంది. పక్షం రోజుల కిందట రూ.లక్ష మార్కు దాటి పోయి ప్రజల గుండెల్లో పరుగెత్తించింది. ఈ మధ్య మళ్లీ కాస్త తగ్గి తులం రూ.96 వేలకు చేరుకుంది. ధరలు చూస్తుంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు బంగారం కలగానే మిగిలిపోనుంది. వారు అటు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండాపోయింది. సాధారణంగా ధనవంతుల ఇళ్లలోని మహిళలు మాత్రమే బంగారు ఆభరణాలను ధరించే వారు. కూలీనాలీ చేసుకుని జీవనోపాధి పొందే సామాన్య ప్రజలు బంగారు అభరణాలకు ఎప్పుడు దూరంగానే ఉంటున్నారు. వారు చూడడమే తప్ప ఆభరణాలు ధరించిన దాఖాలాలు కన్పించలేదు. ఇక మధ్యతరగతి ప్రజలు తమ సంపాదనలో కొంత మేర తమ పిల్లలకు బంగారు ఆభరణాలు కొనుగోళ్లు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు వారిని కూడ కొనుగోలుకు దూరం చేశాయని చెప్పవచ్చు. ఆర్థిక స్థోమత లేని వారు వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను కొనుగోలు చేసి ధరిస్తున్నారు.

వంద రోజుల్లో భారీగా పెరిగిన ధర

మార్కెట్‌లో వందరోజుల్లో తులం బంగారం ధర సుమారు రూ.20 వేల వరకు పెరిగింది. గత సంవత్సరం డిసెంబరు మాసంలో తులం బంగారం ధర రూ.76 నుంచి 78 వేలు పలికింది. క్రమ క్రమంగా ఎన్నడు లేని విధంగా వందరోజుల్లో సుమారు రూ.20 వేల వరకు పెరిగి రూ.లక్షకు చేరువైంది. గతంలో డబ్బులున్న కొంతమంది బంగారం కొనుగోలు చేసి దాచుకునే వారు. బంగారం ధరలు అమాంతం పెరగడంతో వారు కూడా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొంత కాలం కిందట బంగారు ఆభరణాలు ఆర్డర్ ఇచ్చి కొంత పైకం అడ్వాన్స్ ఇచ్చిన వినియోగదారులు అప్పటిధర ప్రకారమే తమకు ఆభరణాలు చేసి ఇవ్వాలనడంతో వ్యాపారులు తలలు పట్టుకున్నారు. ఓ పక్క ధరలు పెరిగి విక్రయాలు లేక, మరోపక్క పాతధరతో ఆభరణాలు చేసి ఇవ్వాల్సి రావడంతో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బంగారం ధరలు పెరగడంతో అటు వినియోగదారులు, ఇటు వ్యాపారులు ఇద్దరు నష్టపోవాల్సి వస్తోంది. ఏది ఏమైనప్పటికి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు .బంగారం కొనుగోళ్లు కలగానే మిగిలి పోనున్నాయి.





బంగారం ధర అడిగి వెళ్తున్నారు..

పెరిగిన బంగారం ధరలతో వినియోగదారులు ధర అడిగి వెళుతున్నారు తప్ప.. కొనడంలేదు. గిరాకీ పూర్తిగా పడిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఖాళీగా షాపు తెరిచి కూర్చుంటున్నాం. మధ్యతరగతి వర్గాల ప్రజలు బంగారు ఆభరణాలు చేయించుకోవడం బంద్ చేశారు. ఉన్నత వర్గాల వారు పట్టణాల్లోని పెద్దషోరూంలలో కొనుగోలు చేయడంతో కులవృత్తిపై ఆధారపడిన మాలాంటి షాపులు, వృత్తిదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

బీ వేణుగోపాలాచారి, బంగారం షాపు నిర్వాహకుడు, కేసముద్రం

ఆలయాల్లో నియామకాలపై ఆరా

- సమాచారం తెప్పించుకున్న దేవాదాయ శాఖ
- వివరాలను అందజేసిన ఆలయ ఈవోలు
- ఉమ్మడి జిల్లాలోని పలు గుళ్లలో అక్రమ నియామకాలు
- స్వీపర్ నుంచి అటెండర్ వరకు పైరవీలతో ఉద్యోగం
- తీగ లాగడంతో కదులుతున్న డొంక

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖలో పదేళ్లలో చేసిన నియామకాల వివరాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లోని దేవాలయాల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఆరు జిల్లాల్లో నాలుగో తరగతి ఉద్యోగినుంచి కార్యనిర్వాహణ అధికారులు (ఈవోల) వరకు 1200 మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు. 2014లో తెలంగాణ ఏర్పడింది. అప్పటి నుంచి 2023 వరకు దేవాదాయ శాఖలో ఎలాంటి ఉద్యోగాలను కొత్తగా ఇచ్చారో తెలుసుకుంటున్నారు. ఇందుకుగాను దేవాదాయ శాఖ అధికారులు ఆయా ఆలయాల నిర్వాహకులకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.


ఈవోలకు ఆదేశాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రధాన ఆలయాల వివరాలను దేవాదాయ శాఖ అడిగింది, ఇప్పటికే ఈ సమాచారం దేవాదాయ శాఖకు చేరింది. దేవాదాయ శాఖ ఈ వివరాలను పరిశీలిస్తోంది. వీరి నియామకాలు ఎలా జరిగాయి? నోటిఫికేషన్ ద్వారా జరిగాయా? లేక దొడ్డిదారిన జరిగాయా? నియామకాల సందర్భంగా విద్యార్హతలు, రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు తదితర నిబంధనలను కచ్చితంగా పాటించారా? లేక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు తీసుకున్నారా? అన్న విషయాలను లోతుగా పరిశీలిస్తున్నారు.

అక్రమ నియామకాలు

ఉమ్మడి జిల్లాలో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే, ఆదాయం కాస్త ఎక్కువగా ఉండే ఆలయాల్లో పదేళ్లకాలంలో నాలుగోతరగతి ఉద్యోగులుగా అనేకమంది నియామకం జరిగినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా స్వీపర్లు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్ల స్థాయిలో పైరవీల ద్వారా అనేక మంది నియమితులైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. సహాయ పూజారులుగా కూడా తాత్కాలిక పద్ధతిపై చాలా మంది నియమితులయ్యారు. వీరందరికీ దేవాలయానికి వచ్చే ఆదాయం నుంచే వేతనాలను చెల్లిస్తున్నారు. దీంతో ఆలయ నిర్వహణకు ఆదాయం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా పాలక మండళ్ల చైర్మన్లు, సభ్యులు తమకు అనుకూలమైవారిని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నియామకాలు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఇలాంటి నియామకాలు జోరుగా జరిగాయి.





రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అక్రమంగా నియామకమైనవారికి సైతం వేతనాలు చెల్లించే ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నియామకాలపై అరా తీస్తోంది. దీంతో తీగలాగితే అవినీతి డొంక కదులుతున్నట్టు తెలుస్తోంది. అక్రమంగా నియామకమైన ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆయా ఆలయ ఈవోలు పదేళ్లలో తమ ఆలయాల్లో ఎంతమంది నియామకమైంది వారి వివరాలన్నిటినీ దేవాదాయ శాఖకు నివేదికల రూపంలో సమర్పించారు.

అర్హత పత్రాల పరిశీలన

గతంలో చిన్న ఆలయాల ఉద్యోగులకు ఆ గుళ్లకు వచ్చే ఆదాయం నుంచి జీతాలను చెల్లించేవారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇలాంటి ఉద్యోగులకు ప్రభుత్వమే ప్రత్యేక పద్దు నుంచి జీతాలను చెల్లిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాలను సమగ్రంగా పరిశీలించేందుకు వాస్తవ సమాచారాన్ని రాబడుతున్నారు. ఇదే క్రమంలో సిబ్బంది అర్హత ధృవపత్రాలను, విజిలెన్స్ విభాగం పరిశీలిస్తున్నట్టు సమాచారం.




భద్రకాళి చెరువు పూడికతీత పనుల విహంగ చిత్రం

పనులు చకచకా..

హనుమకొండ భద్రకాళి చెరువులో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఏడు జోన్లుగా విభజించి చెరువు పూడిక తీస్తున్నారు. భద్రకాళి పూడికతీత, ఆలయ మాడ వీధుల పనులు ఆంధ్రజ్యోతి డ్రోన్ కెమెరాకు చిక్కాయి.

- హనుమకొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



భద్రకాళి ఆలయం చుట్టూ కొనసాగుతున్న మాడ వీధుల నిర్మాణ పనులు

ఉరి వేసుకొని
యువతి మృతి

తాడ్వాయి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపూర్ గ్రామానికి చెందిన తెల్లం ప్రియాంక(21) తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుసైడ్ నోట్ రాసి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయిందని తెలిపారు. ..నాన్న నన్ను క్షమించు నాకు బతకాలని లేదు, అమ్మను జాగ్రత్తగా చూసుకో..నేను బాపమ్మ దగ్గరకు వెళుతున్నా ఇక్కడ నమ్మకస్తులు ఎవరు లేరు నాన్న.. నేను లేకుండా మీరు బ్రతకలేరు అని తెలుసు, నా చావుకు నేను కారణం ఎవరు కారణం కాదు, నన్ను క్షమించు.. అని రాసిందన్నారు. మృతురాలి తండ్రి తెల్లం పుల్లయ్య ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టామని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు.

రాహుల్ పోరాటంతోనే కుల గణన ప్రకటన

- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

ములుగు, మే 4(ఆంధ్రజ్యోతి): తమ నాయకుడు రాహుల్ గాంధీ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం కుల గణన ప్రకటన చేసిందని బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ఆదివారం సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ఇద్దరు మంత్రులు హాజరై మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తుందని, ఇది ముమ్మాటికి దుర్మార్గమైన ఆలోచనేనని అన్నారు. దేశ నిర్మాణం ఉన్నతంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. బీజేపీ ప్రభుత్వం బహుళ జాతి సంస్థల కోసం ఆలోచిస్తుందే తప్ప, దేశ ప్రజల కోసం ఆలోచించడం లేదన్నారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ చేసిన సేవలు, స్వాతంత్రం వచ్చిన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అనంతరం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తదితర అంశాలను ప్రజలకు చేరవేయాలన్నారు. అలాగే బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కించపరుస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాల ను అమలు చేస్తున్న విధానాన్ని ప్రజలకు తెలియజే యాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఇన్‌చార్జీలు కైలాష్, నేత సాంబయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

ములుగు రూరల్ : 50ఏళ్ళు నిండిన గీత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలంటూ ఆదివారం ములుగు జిల్లా కేంద్రానికి విచ్చేసిన రవానశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రిని కోరారు. కల్లుగీత కార్మిక కార్మికులు సేఫ్టీ మోకులతో పాటు ప్రతీ ఒక్కరికి బైకులు అందజేయాలని కోరారు. అలాగే ములుగు జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముసనపెల్లి కుమార్‌గౌడ్, కునూరు అశోక్‌గౌడ్, బుర్ర జనార్దన్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బొమ్మెర శ్రీనివాస్‌గౌడ్, పున్నంగౌడ్ పాల్గొన్నారు.

సాయిప్రకాశ్ సేవలు మరువలేనివి



సంతాపసభలో మాట్లాడుతున్న సీఐ కుమార్

వెంకటాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ సేవలు మరు వలేనివని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సాయిప్రకాశ్ సంతాపసభ జరగగా సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్ రావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్‌హుస్సేన్, నాయకులు చిడెం రవికుమార్, రంజిత్, లీలారాణి, గార్లపాటి రవి, ఓంకార్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో ఉద్యమకారులు

భూపాలపల్లిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు సహకారం అందించాలని ఆదివారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పలువురు ఉద్యమకారులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావును కలిసి విన్నవించారు. కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో జరుగగా ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఉద్యమకారులు ముద్దమల్ల భార్గవ్, భీముని సారయ్య, భద్రయ్య, కోల శ్యాం, గట్ల రాజన్న, భూమయ్య, జోగు ల సమ్మయ్య, ఉపాధ్యాయులు బానోతు సేవానాయక్, అజ్మీర దేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

భూపాలపల్లి కలెక్టరేట్, మే4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకోవడంతో భూపాలపల్లి బీజేపీ నాయకులు నప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్బంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిచందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకుడు కంబాల రాజయ్య, దొంగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

గోవిందరావుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని సీపీఎంపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. నాయ కులు పొదిళ్ల చిట్టిబాబు, సోమ మల్లారెడ్డి, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, గుండు రామస్వామి, అంబాల మురళి, క్యాతం సూర్యనారాయణ పాల్గొన్నారు.

పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, మే 4(ఆంధ్రజ్యోతి) : అవాంతరాలను లెక్క చేయకుండా లోక కల్యాణం కొరకు దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చిన అపరభగీరథుడు భగీరథమహర్షి అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో ఆదివారం సగరసంఘం ఆధ్వర్యంలో సగర భగీరథమహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కాగా గ్రామస్థులు శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, సీనియర్ నాయకులు నాంసాని రాంబాబు, సగర కుల పెద్దమనుషులు ప్రశాంత్, కరుణాకర్, చాగల్ల శ్రీధర్, నాయకులు శ్రీధర్, పున్నం రవి, పట్టెం శంకర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కలెక్టరేట్‌లో భగీరథ జయంతి వేడుకలు

భూపాలపల్లి : కలెక్టరేట్‌లో మహర్షి భగీరథ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి భగీరథ జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ మహర్షి భగీరథ సేవా దృక్పథం,ప్రజల పట్ల ఉన్న బాధ్యత భావాన్ని మన జీవితాల్లో అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి క్రాంతి కిరణ్, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మాజీ జడ్పీటీసీ చందు గాంధీ, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, టౌన్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, ఈసం నర్సయ్య, ఎమ్డీ. గౌస్ పాల్గొన్నారు.

ధన్వాడ కాంప్లెక్స్ పరిధిలో
ఎస్జీటీలకు జమకాని జీతాలు..!

● జీతాల బిల్లు సమర్పణలో జరిగిన పొరపాటుతో ఇబ్బందులు

కాటారం, మే 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, స్పెషల్ టీచర్లకు ఈ నెల 1న జీతాలు జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాంప్లెక్స్ పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలలకు చెందిన 29 మంది టీచర్లు జీతాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. రుణాల ఈఎంఐలు సకాలంలో చెల్లించకుంటే పడే ఫైన్, సిబిల్ స్కోర్ల విషయమై టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల 1న జమయ్యే జీతాలతో పలు అవసరాల కోసం ప్లాన్ చేసుకునే ఉపాధ్యాయులు జీతాలు ఎందుకు రాలేదోనని టెన్షన్ పడుతున్నారు. కాగా ధన్వాడ కాంప్లెక్స్ పరిధిలోని ఎస్టీటీలు, ఇతర టీచర్ల జీతాల బిల్లుల సమర్పణ ప్రతి నెల 26వ తేదీలోగానే ఎస్టీవోలో డీడీవో జమ చేయిస్తారు. గత నెలలో సైతం కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీదేవి జీతాల బిల్లులు సమర్పించినట్లు తెలుస్తోంది. కానీ ఏదో పొరపాటుతో బిల్లు తిరస్కరణకు గురయినట్లు, దీంతో సప్లిమెంటరీ బిల్లు సమర్పించినట్లు సమాచారం. ఏదేమైనా జీతాలు సకాలంలో అందకపోవడంతో ఉపాధ్యాయులు అసలు జరిగిందేమిటి..?బిల్లుల విషయంలో అవకతవకలు జరిగాయా..జీతాలు ఎప్పుడొస్తాయని చర్చించుకుం టున్నారు. కాగా దామెరకుంట పీఎస్‌లో పనిచేసే టీచర్ సంతోష్ గత నెలలో అనారోగ్యంతో మృతిచెందగా అతడి జీతం బిల్లు పూర్తిస్థాయిలో చేయడంతో ధన్వాడ కాంప్లెక్స్ ఎస్జీటీ టీచర్ల జీతాల బిల్లు మొత్తం తిరస్కరణకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో బిల్లును మరోసారి పంపడంతో జీతాలు ఆలస్యమవుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ధన్వాడ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, కాంప్లెక్స్ డీడీవో శ్రీదేవి ని అడగగా బిల్లు ట్రెజరీలో ఓకే అయిందని, ఒకటి రెండు రోజుల్లో జీతాలు జమ అవుతాయన్నారు. మృతి చెందిన టీచర్ జీతం బిల్లు విషయంలో జరిగిన గందరగోళంతో ఇబ్బంది వచ్చిందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వెంకటాపూర్, మే 4, (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు..20 ఏండ్ల తర్వాత కలిసిన స్నేహితులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో 2005-2007 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాల ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో నాటి విద్యార్థులు వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ మేరకు వెంకటాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను సన్మానించారు. అనంతరం అప్పటి ప్రిన్సిపాల్ వెంకట స్వామి, అధ్యపకులు వెంకటేశ్వర్లు, నాగేందర్, మహేందర్, సమ్మయ్య, వెంకన్న, రాజేందర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు జనగాం రాజు, కుక్కల సంతోష్, పూర్ణ, సురేష్, రాజేందర్, ఓంకార్, రఘు, సాగర్, సతీష్, జ్యోతి పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి




ఆలయంలో భక్తుల సందడి, లక్ష్మీనర్సింహస్వామి మూలవిరాట్

మంగపేట, మే 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహాస్వామిని ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం ఉదయమే కొండపైకి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి దైవ దర్శనాలు చేసుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ జలాంజనేయస్వామిని, శ్రీ పంచముఖాంజనేయాస్వామిని శ్రీ వేణుగోపాలస్వామిని, శ్రీ రమసత్యనారాయణ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తదనం తరం కొండపై కొలువుదీరిన స్వయాంభు పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహాస్వామిని ప్రక్కనే కొలువుదీరిన దేవతమూర్తులైన ఆదిలక్ష్మి చెంచులక్ష్మిలను దర్శించుకొని పసుపు, కుంకుమ చీరే సారే పూలదండలు సమర్పించి టెంకాయలు కొట్టి దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రధానా ర్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, రిటైర్డు అర్చకుడు కైంకైర్యం రాఘవా చార్యులు అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ అనిపెద్ది మురళీకృష్ణశర్మలు స్వామివారి మూలవిరాట్‌కు తిలాతైలాభి షేకాలు చేసి నూతన వస్త్రాలు గజమాలతో సుందరంగా అలంకరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

గుండెపోటుతో బాలింత మృతి

గణపురం, మే 4(ఆంధ్రజ్యోతి) : మూడు నెలల క్రితమే పాపకు జన్మనిచ్చింది. పాప పాల కోసం తల్లి నిద్రలో ఉందని ఏడుస్తూనే ఉంది.. ఎంతకూ లేవకపోవడంతో గమనించిన బాలింత తల్లిదండ్రులు లేపడానికి ప్రయత్నించారు. ఎంతకూ లేవకపోవడంతో భూపాలపల్లి 100పడకల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ హృదయ విదారక సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బోయిని సాంబయ్య కూతురు పూజితకు అదే గ్రామానికి చెందిన మాల నగేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా పూజితకు మూడేళ్ల కుమారుడు ఉండగా మూడు నెలల క్రితం మరో పాపకు జన్మనిచ్చింది. దీంతో బాలింత కావడంతో తల్లి ఇంటి వద్దనే ఉంటోంది. ఆదివారం ఉదయం పూజిత కాలకృత్యాలకు వెళ్ళొచ్చి నిద్రించింది. ఈ క్రమంలో పాప పాలకోసం ఏడుస్తుండగా ఎంతకూ తల్లి నిద్రలేవకపోవడంతో ఇది గమనించిన పూజిత తల్లిదండ్రులు భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. పసిపాప ఏడ్వడం చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

వెంకటాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వీరభద్రవరం గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్యకాలనీలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని బంద లక్ష్మీ అనే మహిళ పూరింటికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో గమనించిన గ్రామస్థులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో రూ.30వేల నగదుతోపాటు వస్తుసామగ్రి కాలి బూడిదైంది.

పదోతరగతి జిల్లా టాపర్‌కు ఆర్థిక చేయూత

గోవిందరావుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి జిల్లా టాపర్‌గా నిలిచిన మండలంలోని చల్వాయి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని డి.కారుణ్యకు ఆర్థిక చేయూతనందించారు. ఆదివారం ములుగు జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణాధికారి అప్పని జయదేవ్ ప్రోత్సాహకంగా కారుణ్యకు రూ.10వేల నగదు అందజేసి అభినందించి మాట్లాడారు. కారుణ్య 577/600 మార్కులు సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటం మల్లారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హట్కర్ సమ్మయ్య, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్, ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలి

వెంకటాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో జరుగుతున్న అక్రమ గ్రావెల్, ఇసుక దందాకు అడ్డకట్ట వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మైనింగ్, రెవెన్యూ అధికారులను కోరారు. ఆదివారం మండలంలోని తుర్సగూడెం గ్రామంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు, చట్టాలు ఉన్నాయని, వాటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈనెల 5వతేదీన నిర్వహించాల్సిన కలెక్టరేట్ ముట్టడి వాయిదా పడిందని, ఈవిషయాన్ని నాయకులు, కార్యకర్తలు గమనించాలని ఆయన కోరారు. నాయకులు తాటి రాంబాబు, నర్సింహ, బొగ్గుల ప్రశాంత్, కుర్సం శంకర్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

మొగుళ్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాణి అన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగకుండా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితి అయితేనే తప్ప ప్రజలు బయటకు వెళ్లకూడదని అన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య ఇళ్లనుంచి బయటకు వెళ్లకూడదని అన్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగతున్న నేపథ్యంలో వడదెబ్బ, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వంటలు చేయకూడదని, ఎండలో పని చేయవద్దని, టీ, కాఫీ, చల్లని కూల్‌డ్రింక్స్, స్వీట్లు, చల్లని పిక్స్ తీసుకోవద్దని సూచించారు. తరచూ ఎండలో పనిచేసే కార్మికులు గొడుగు, టోపీలు వాడాలని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకుంటూ వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవాలని ఆమె వివరించారు.

వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలి

మొగుళ్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన అగ్రిటెక్ షాపును ప్రారంభించి మాట్లాడారు. రైతులకు వ్యవసాయానికి ఉపయోగపడే పనిముట్లు అందుబాటులో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మన అగ్రిటెక్ సంస్థ ఎండీ పానికంటి రమేష్, వరంగల్ ఎనుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ పనిముట్లతో మార్కెట్ మాజీ చైర్మన్ రమేష్

పాలంపేట ఎస్సీ కాలనీలో నీటి ఇబ్బందులు

వెంకటాపూర్, మే 4, (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం గ్రామమైన పాలం పేటలో గల ఎస్సీ కాలనీలో మంచినీటి కనెక్షన్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయితీ నుంచి కానీ, మిషన్ భగీరథ నుంచి కానీ, నల్ల కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాలంపేట గ్రామంలో కోట్లు వెచ్చించి అంతర్జాతీయ స్థాయి లో అభివృద్ధి పనులు జరుగుతున్న గ్రామంలో దళిత వాడకు మౌళిక సదుపాయాల్లో ఒకటైన మంచినీరు సౌకర్యం లేకపోవడం విడ్డూరంగా ఉందంటున్నారు. దళితవాడలో మౌలిక సదుపాయాలు ఇప్పటికైనా కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పాలంపేటలోని ఎస్సీ కాలనీలో ట్యాంకర్ ద్వారా నీళ్ళు పట్టుకుంటున్న కాలనీ వాసులు

గీత కార్మికులను ఆదుకోవాలి

మంగపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మంగపేట మండలంలో 2001 సంవత్సరం నుంచి గీత సొసైటీలను రద్దుచేసి గీతకార్మికులకు బతుదెరువు చేశారని తెలంగాణ ఏజేన్సి గౌడ్ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మంగపేటలో నర్సయ్యగౌడ్ విలేకర్లతో మాట్లాడారు. 2001 నుంచి నేటి వరకు తాడిచెట్టుపై నుంచి ప్రమా దవశత్తు పడి మరణిస్తే రూ, 5 లక్షల నష్ట పరిహారం, 50 ఏళ్ల దాటిన గీతకార్మికులకు పింఛన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు మండలంలోని గీత కార్మికుల కు చెందడం లేదన్నారు. ఈ విషయంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఏజేన్సి గ్రామాల్లో నివసిస్తున్న గీతకార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు ఇచ్చేవిధంగా చొరవ తీసుకొని ఏజెన్సీ గౌడ్‌లను ఆదుకోవాలని కోరారు. మంత్రి ధనసరి సీతక్కకు ములుగులో ఆదివారం రాష్ట్రమంత్రుల పర్యటన సందర్భంగా తమ సంఘం ఆధ్వర్యంలో వినితిపత్రం అందజేశామని, అందుకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామిచ్చారని నర్సయ్యగౌడ్ తెలిపారు.

వైభవంగా చిరుతల రామాయణం వేడుకలు

కాటారం, మే 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని దామెరకుంట గ్రామంలో చిరుతల రామాయణం వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలువురు గ్రామస్తులు వివిధ రకాల పాత్రలను ధరించి పురాణ ఇతిహాసమైన రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. చిరుతల రామాయణం వేడుకల్లో మొదటి రోజున శ్రీరాముడు, లక్ష్మణుడు, భరత, శతృఘ్నుల జననం, శ్రీరాముడి పాదం తాకి రాయిగా మారిన అహల్య శాపవిమోచనమైన ఘట్టాలు కన్నుల పండువగా సాగాయి. రామాయణ పాత్రధారులంతా తమ నటనాకౌశలాన్ని ప్రదర్శించారు. రామాయణ వేడుక లను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కాటారం సీఐ నాగార్జునరావు మాట్లాడుతూ ఆది కావ్యమైన మహాకావ్యాన్ని వేల సంవత్సరాలు గడిచినా చిరుతల రామాయణం రూపంలో ప్రదర్శితమవడం గొప్ప విషయమన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై చిరుతల రామాయణాన్ని తిలకించి పులకించిపోయారు. దశరథుడిగా అడువాల సమ్మయ్య, కౌసల్య, సుమిత్ర, కైకేయి లుగా తోట శ్రావణ్, ఏదునూరి రాజు, గోనె మల్లయ్య, శ్రీరాముడిగా పసుల రాజమౌళి, లక్ష్మణుడిగా చీమల మల్ల య్య, భరతుడిగా అడువాల రవీందర్, శతృఘ్నుడిగా అడు వాల రాజేందర్, అహల్యగా పసుల హర్షిత, విష్ణుమూర్తిగా అడువాల సంతోష్, భూదేవిగా నారాయణ, మందరగా గొరోజు శ్రీనివాస్, సరళగా చీమల సత్యం, గుహుడిగా రాజ య్య, పరశురాముడిగా గోనె సాయి, జటాయువుగా రాజమల్లు తమ పాత్రల అభినయంతో ఆహుతులను అలరించారు. పలువురు గ్రామ పెద్దలు, వివిధపార్టీల నాయకులు, ప్రజలు తదితరులున్నారు.



రామాయణం ప్రదర్శిస్తున్న పాత్రధారులు